## కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం

ధర్మపురి,ఏప్రిల్18: పార్లమెంట్ ఎన్నికల్లో మాది గల సత్తా చాటుతామని, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి బుద్ధి చెబుతామని అంబేద్కర్ సంఘం రాష్ట్ర వ ర్కింగ్ ప్రెసిడెంట్ ము ల్కాల గంగారాం తేల్చిచెప్పారు. ధర్మపురిలోని కర్నె అక్కెపెల్లి కల్యాణ మండపంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో 80 లక్షలకు పైగా మాదిగలు ఉన్నారని, కానీ కాంగ్రెస్ ఒక్క పార్లమెంట్ స్థానం నుంచి కూ డా మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సీట్లు ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పడాన్ని మాదిగలు నమ్మబోరన్నారు. వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో రేవంత్‌రెడ్డి నియమించిన న్యాయవాది ఎవరో చెప్పాలన్నారు. వివేక్ వెంకటస్వామి ఆస్తులను కాపాడుకోవడానికే రాజకీయం చేస్తున్నారన్నారు. ఒకే కుటుం బం నుంచి మూడు రిజర్వేషన్లు పొందుతున్న వివేక్ వెంకటస్వామి దళితులకు సమాధానం చెప్పాలన్నారు. రాహుల్‌గాంధీకి రూ. 500 కో ట్లు ఇచ్చి తన కొడుకు వంశీకి పెద్దపల్లి టికెట్ తెచ్చుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి హనుమాండ్లు, నేతలు అవునూరి శ్రీకాంత్, సత్తయ్య, అరవింద్, ప్రశాంత్ ఉన్నారు.

## హరితహారం మొక్కలు ఎండుతున్నాయి

హరితహారంలో భాగంగా నాటిన మొక్కల నిర్వహణ కరువైంది. పట్టించుకునే వారు లేక ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. కురిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు దెబ్బతిన్నాయి. చాలా వరకు మొక్కలు నాటిన ఆనవాళ్లే లేకుండా పోయాయి.

-గంగాధర, ఏప్రిల్ 18



కురిక్యాలలో జాతీయ రహదారి పక్కన ఎండి పోయిన మొక్కలు





బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థులు బోయినపల్లి వినోద్‌కుమార్, కొప్పుల ఈశ్వర్



కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫాం తీసుకుంటున్న నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

## భవిష్యత్ మనదే.. గెలుపు కూడా మనదే

- అధినేత కేసీఆర్ దిశానిర్దేశం
- అభ్యర్థులకు బీ ఫాంలు

పెద్దపల్లి, ఏప్రిల్18(నమస్తే తెలంగాణ)/ కరీంనగర్ కార్పొరేషన్/ జగిత్యాల : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు బీఫాంలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి అధినేత కేసీఆర్ హాజరయ్యారు. రాష్ట్రంలో భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, రాబోయే ఎన్నికల్లో గెలుపు కూడా మనదేనని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు బీ ఫాంలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. గట్టిగా పోరాడితే మంచి ఫలితాలు వస్తాయని, మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందని సూచించారు. మన ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లితోపాటు నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ అభ్యర్థులు బోయినపల్లి వినోద్ కుమార్, కొప్పుల ఈశ్వర్, బాజిరెడ్డి గోవర్ధన్ బీ ఫాంలు అందుకున్నారు. వారివెంట పార్లమెంట్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జడ్పీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### నేడు కేటీఆర్ రోడ్ షో

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రానికి రానున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఉదయం 10.30 గంటలకు నామినేషన్ వేసిన అనంతరం 11 గంటలకు నిర్వహించే రోడ్ షోలో పాల్గొననున్నారు. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి నిర్వహించే రోడ్ షోలో పాల్గొని, ప్రసంగించనున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికుల కోసం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలతోపాటు కాళేశ్వరం ఎత్తిపోతలతో మంథనిలాంటి ప్రాంతంలోని చివరి ఆయకట్టు వరకు అందిన సాగునీరు, తద్వారా రైతులు పొందిన లబ్ధి, అలాగే చేసిన అభివృద్ధి గురించి వివరించనున్నారు. ఇదే సమయంలో అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం చేసిన తీరు, ఆ పార్టీకి ఓటు వేస్తే జరిగే నష్టాన్ని వివరించనున్నారు. అలాగే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులుండాల్సిన అవసరం వంటి విషయాలను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. బీజేపీ ద్వారా తెలంగాణకు జరిగిన అన్యాయం, ప్రస్తుతం నదుల అనుసంధానం పేరిట జలదోపిడీ ఇలా అనేక అంశాలను అర్థమయ్యేలా వివరించనున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై రోడ్‌షోను విజయవంతం చేయాలని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్ కోరారు. కేటీఆర్ రోడ్‌షో ద్వారా బీఆర్ఎస్‌లో నయా జోష్ నిండుతుందని పార్టీవర్గాలు భావిస్తున్నాయి. కొప్పుల ప్రచారానికి మరింత ఊపు తెస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# నామినేషన్ల పర్వం మొదలు

- తొలి రోజు పెద్దపల్లిలో నాలుగు, కరీంనగర్, నిజామాబాద్‌లో రెండు చొప్పున దాఖలు
- అట్టహాసంగా దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధమైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- నేడు పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థిగా కొప్పుల నామినేషన్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో
- 20న కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్ కుమార్
- ఇప్పటికే బీఫాంలు అందుకున్న గులాబీ అభ్యర్థులు
- ప్రచారంలో దూసుకెళ్తున్న కారు

**పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం నుంచి మొదలైంది. తొలిరోజు పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో నాలుగు, కరీంనగర్, నిజామాబాద్‌లో రెండు చొప్పున నామినేషన్లు దాఖలు కాగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు అట్టహాసంగా దరఖాస్తులు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానుండడంతోపాటు పెద్దపల్లిలో నిర్వహించే రోడ్ షోలో పాల్గొననున్నారు. ఇటు కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఈ నెల 20న నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, గులాబీ అభ్యర్థులంతా గురువారమే అధినేత కేసీఆర్ చేతుల మీదుగా బీఫాంలు అందుకున్నారు. అయితే, నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. అవసరాన్ని బట్టి.. అదనపు భద్రతను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.**

కరీంనగర్, ఏప్రిల్ 18 (కరీంనగర్ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి తొలి అంకం గురువారం ప్రారంభమైంది. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, అదే రోజు పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటన, వచ్చే నెల 13న పోలింగ్ ఉండనున్నది. కాగా, నామినేషన్లు అట్టహాసంగా వేసేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు సిద్ధమయ్యారు. ప్రధానంగా ప్రచారంలో ఇప్పటికే దూసుకెళ్తున్న భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు ముహూర్తం చూసుకొని మరీ డేట్ ఫిక్స్ చేసుకున్నారు. అందులో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. అలాగే, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ ఈ నెల 20న తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సైతం బీఆర్ఎస్ అగ్రనేతలు తరలి రానుండగా.. అట్టహాసంగా నామినేషన్ వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

### ప్రచారంలో బీఆర్ఎస్ హవా

అన్ని పార్టీల కంటే ముందే లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మార్చి 12న పార్లమెంట్ ఎన్నికలకు కదనభేరి మోగించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు బీజేపీకి ఓటు వేస్తే వచ్చే నష్టాల గురించి వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అందుకు ఎలా పనిచేయాలో.. ఎలా కష్టపడాలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆ మేరకు పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో మరింత స్పీడ్ పెంచారు. శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ మద్దతు కూడగట్టారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో చూస్తే కొప్పుల ఈశ్వర్ సింగరేణి ప్రాంతంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అదే బీజేపీ నేటి వరకు పెద్దగా ప్రచారం చేసినట్లు కనిపించడం లేదు. ఇక కాంగ్రెస్ అడ్డదారుల్లో పయనిస్తున్నది. బీఆర్ఎస్ నాయకులే టార్గెట్‌గా కుట్రలు, కుతంత్రాలతో ముందుకెళ్తున్నది. ముందుగా బేరసారాలు చేస్తూ.. పార్టీలోకి ఆహ్వానిస్తున్నది. అలా రాని వారిని బెదిరింపులకు పాల్పడుతున్నది. పోలీసుల అండతో కేసులు పెడుతున్నది. అయినా, బీఆర్ఎస్ నాయకులు చెక్కు చెదరని సంకల్పంతో ముందుకెళ్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ ముందజలో ఉన్నారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గాన్ని ఓ దఫా చుట్టేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తానో స్పష్టతనిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారు. బీజేపీ ప్రచారం చేస్తున్నా.. గెలిపిస్తే ఏమి చేస్తారో అన్న అంశంపై మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. కేవలం ఆయన ప్రచారంలో మెజార్టీ భాగం దేవుడి పేరుతోనే నడుస్తున్నది. ఇక కాంగ్రెస్ అయితే అభ్యర్థినే ప్రకటించ లేదు. కానీ, తనకే టికెట్ వస్తుందని వెలిచాల రాజేందర్ రావు చెప్పుకుంటున్నారు. ఇదే సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌సైతం ఆయనను వెంట పెట్టుకొని ప్రచారం చేస్తున్నారు.




కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట పోలీసుల బందోబస్తు

### తొలిరోజు ఆరు దాఖలు

పెద్దపల్లి, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ)/కరీంనగర్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల పర్వం మొదలైంది. కరీంనగర్ పార్లమెంట్‌కు సంబంధించి కరీంనగర్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో.. పెద్దపల్లి లోక్‌సభకు సంబంధించి పెద్దపల్లి కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయగా, తొలిరోజు అంతంతమాత్రమే నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. కరీంనగర్ స్థానానికిగాను తొలిరోజు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కోట శ్యాంకుమార్, గంగాధర మండలం గట్టు బూత్కూర్ గ్రామానికి చెందిన పొత్తూరి రాజేందర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి తమ నామినేషన్లు అందజేశారు. ఇక పెద్దపల్లికి స్థానానికిగాను తొలిరోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సెగ్మెంట్ పరిధిలోని దూడ మహిపాల్, దుర్గం రాజ్ కుమార్, నూకల నవీన్ , అక్కపాక తిరుపతి తలా ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. అటు నిజామాబాద్‌లో రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుడు రాపెల్లి సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా, జగిత్యాల జిల్లా రాయికల్ మండలానికి చెందిన విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి భూక్య నందు నామినేషన్లు దాఖలు చేశారు.

# కార్యకర్తపైకి కవ్వంపల్లి

సమావేశంలో కార్యకర్త భద్రయ్య పైకి దూసుకెళ్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



- ప్రశ్నించినందుకు వేదికపై నుంచి దూసుకొచ్చిన ఎమ్మెల్యే
- ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ నెట్టేసి.. ఆగ్రహం
- 'ఎంత కొడుతవో కొట్టు' అంటూ ఎదురుతిరిగిన కార్యకర్త
- మద్దతుగా నిలిచిన మరికొంత మంది శ్రేణులు
- మంత్రి పొన్నం ఎదుటే ఘటన
- హుజూరాబాద్‌లో కార్యకర్తల మధ్య వాగ్వాదం

**కాంగ్రెస్‌లో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. రాష్ట్ర నాయకుల ఎదుటే బహిర్గతమవుతున్నాయి. గురువారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహ సమావేశాల వేదికగా బట్టబయలయ్యాయి. ఎల్వోసీ గురించి ప్రశ్నించిన కార్యకర్తపైకి.. పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి ఏకంగా వేదికపై నుంచి కిందకు దూకడం, వెళ్లిపోవాలంటూ నెట్టేస్తూ ఆగ్రహించడం, ఆ కార్యకర్తతోపాటు మరికొంత మంది కార్యకర్తలు ఎదురుతిరగడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో స్టేజీ పైనున్న మంత్రి పొన్నంతోపాటు మరికొంత మంది నాయకులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. అలాగే హుజూరాబాద్ సమావేశంలోనూ పాత, కొత్త నాయకుల మధ్య గొడవ జరిగింది.**

తిమ్మాపూర్/ హుజూరాబాద్ ఏప్రిల్ 18 : కరీంనగర్ నగర పరిధి అల్గునూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా, మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త ఎడ్ల భద్రయ్య తమ గ్రామంలోని పోచమ్మ గుడికి వెళ్లే దారిని కాల్వ మహేందర్ అనే వ్యక్తి కబ్జా చేశాడని రెండు నెలల కింద ఎమ్మెల్యేకు తెలిపాడు. అయితే, ఇటీవల మహేందర్ అనారోగ్యానికి, చికిత్స కోసం ₹2.5 లక్షల ఎల్వోసీని ఎమ్మెల్యే అందజేశాడు. ఈ విషయమై భద్రయ్య సమావేశ వేదిక ముందుకెళ్లి.. తమను కాదని మహేందర్‌కు ఎల్వోసీ ఎలా ఇచ్చారంటూ ఎమ్మెల్యేను ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే వేదికపై నుంచి కిందికి దూకి కార్యకర్తపైకి దూసుకెళ్లాడు. ఈ హఠాత్పరిణామంతో కంగుతిన్న కార్యకర్తలు ఎమ్మెల్యేను, కార్యకర్తను నిలువరించారు. ఇద్దరు మాటామాటా అనుకున్నారు. 'కొడతావా.. కొట్టు. ఎంత కొడతావో కొట్టు?' అంటూ ఎమ్మెల్యేను భద్రయ్య నిలదీశాడు. అయినా వినని కవ్వంపల్లి ఆ కార్యకర్తను ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నెట్టేశాడు. దీంతో భద్రయ్యకు తోడుగా మరి కొంత మంది కార్యకర్తలు సైతం ఎదురుతిరిగారు. స్టేజిపైన ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కవ్వంపల్లిని నిలువరించే ప్రయత్నం చేశాడు. ఆయనతోపాటు నాయకులు కూడా జోక్యం చేసుకోవడంతో ఈ గొడవ సద్దుమణించింది. అయితే ఎమ్మెల్యే కార్యకర్తపైకి దూసుకెళ్లిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

### హుజూరాబాద్‌లోనూ గలాటా

హుజూరాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో జరిగిన నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలోనూ గొడవ జరిగింది. పాత, కొత్త కార్యకర్తల మధ్య వివాదం చోటు చేసుకున్నది. ఈ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉండగా, అనుకున్న సమయానికి రాలేదు. దాంతో కాంగ్రెస్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి.. ముఖ్య నాయకులను సభపైకి ఆహ్వానిస్తుంటే ఒక్కొక్కరుగా వచ్చి ఆసీనులవుతున్నారు.




ప్రణవ్‌ను నిలదీస్తున్న పాత కాంగ్రెస్ కార్యకర్తలు

ఈ క్రమంలో ఇటీవలే పార్టీలో చేరిన దేశిని కోటి, వడ్లూరి విజయ్‌కుమార్, నేరెళ్ల మహేందర్‌గౌడ్, తదితర నాయకులను పిలువగా స్టేజీపైకి వచ్చి కూర్చున్నారు. అయితే ఇంతలోనే కొందరు కార్యకర్తలు స్టేజీపైకి వచ్చి గొడవకు దిగారు. ఆది నుంచీ పార్టీ కోసం పనిచేసిన తమను కాదని, నిన్నామొన్న పార్టీలో చేరిన నాయకులను పిలవడం సమంజసం కాదని పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను నిలదీశారు. ఆయన వెంటనే తేరుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వాళ్లు వినకపోవడంతో పాత, కొత్త నాయకుల మధ్య గలాట మొదలైంది. చివరకు స్టేజీపై నియోజకవర్గ ఇన్‌చార్జిలు తప్ప వేరే వాళ్లను పిలిచేది లేదని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. దాదాపు అరగంట పాటు ఏం జరుగుతందో అక్కడ ఉన్న కార్యకర్తలకు పాలుపోలేదు. పాత క్యాడర్‌కు విలువ ఇవ్వకపోతే గిట్లనే గొడవ జరుగుతుందని పలువురు కార్యకర్తలు వాపోయారు. మరోవైపు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశానికి పొన్నం రావాల్సి ఉండగా.. సాయంత్రం 4.30కు రావడంపై కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకే తాము వచ్చామని, ఎంత సేపు వేచి ఉండాలని ప్రశ్నించారు.

# పట్టుబడింది రేషన్ బియ్యమే

- బ్యాగులు మార్చి గుజరాత్‌కు తరలించే ప్రయత్నం
- హుజూరాబాద్‌లో 350 క్వింటాళ్లు స్వాధీనం
- ల్యాబ్ పరీక్షలో పీడీఎస్ రైస్‌గా నిర్ధారణ
- ముగ్గురిపై 6ఏ కేసు.. ఇద్దరి అరెస్ట్



జై శ్రీరాం బ్యాగుల్లో నింపిన రేషన్ బియ్యం

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 18 : రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతున్నది. ఎన్ని రకాలుగా పక్కదారి పట్టాలో అన్ని రకాలు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నది. తక్కువ ధరకు కొని, ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ముచేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తున్నది. ఇలానే ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు పది రోజుల క్రితం జైశ్రీరాం బ్యాగుల్లో పీడీఎస్ రైస్‌ను ప్యాక్ చేసి గుజరాత్‌కు తరలిస్తుండగా, హుజూరాబాద్‌లో పట్టుకోవడం సంచలనం సృష్టించింది. శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేయగా, అవి రేషన్ బియ్యమే అని తేలడంతో దందా గుట్టు రట్టయింది. సివిల్ సప్లయ్ హుజూరాబాద్ డీటీ వసంతరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలకు చెందిన శ్రీ రాజరాజేశ్వర ప్యాడి అండ్ జనరల్ రైస్‌మిల్లులో రామిడి శ్రావణ్‌కుమార్ అనే వ్యాపారి ఎవరికీ అనుమానం రాకుండా పీడీఎస్ బియ్యాన్ని జై శ్రీరామ్ పేరుతో ఉన్న కవర్లలో (సంచుల్లో) నింపారు. హుజూరాబాద్ మీదుగా గుజరాత్‌కు లారీ (జీటీ 36 యూవీ 4535)లో అక్రమంగా తరలిస్తుండగా, ఈ నెల 10న అర్ధ రాత్రి పోలీసులు అనుమానించి పట్టుకున్నారు. ఈ నెల 11న సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించగా, లారీలోని బియ్యాన్ని శాంపిల్‌గా తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. అవి ఆరు నెలల క్రితపు పీడీఎస్ బియ్యంగా గుర్తించి సివిల్ సప్లయ్ అధికారులకు సర్టిఫికెట్ ఇవ్వడంతో వారు రైస్ మిల్ యజమాని శ్రవణ్‌కుమార్, లారీ డ్రైవర్, క్లీనర్‌పై 6ఏ కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. సీజ్ చేసిన 350 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను హుజూరాబాద్ పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించి భద్రపరిచారు.

## ఇద్దరు ఎస్ఐల సస్పెన్షన్

- గంజాయి మిస్సింగ్ ఎఫెక్ట్

జగిత్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18 : సారంగాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి మాయమైన కేసుకు సంబంధించి ఇద్దరు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమంగా రవాణా చేస్తున్న 70 కిలోల గంజాయిని సారంగాపూర్ పోలీసులు వాహనంతో సహా గత సంవత్సరం పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. కాగా, స్టేషన్ నుంచి గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గంజాయి భద్రపరచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని జగిత్యాల ఎస్పీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సారంగాపూర్ గత ఎస్ఐ మనోహర్ రావు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నరేందర్‌ను సస్పెండ్ చేసినట్లు మల్టీ జోన్-1 ఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.